# 'పెద్దింటోళ్లు'

క్లాసురూంలో కెళ్లిన గౌతమి గిర్రున వెనక్కి తిరిగొచ్చేసింది అక్కడ వుండలేక. స్టాఫ్‌రూంలో కెళ్లి బల్లమీద కూజాలోంచి రెండు గ్లాసుల నీళ్లు తాగి కుర్చీలో కూర్చుండి పోయింది. తన మనస్సే తనని చూసి వెక్కిరిస్తున్నట్టనిపించింది. తన చదువూ సంస్కారం అంతా వృథా అనిపించింది. జరిగినదంతా కళ్లముందు సినిమా రీళ్లలా కదులుతూంటే, నుదుటిన రాయి చిట్లిపోతాయేమోనన్నంత భయంతో, రెండు చేతులలోనూ కణతలను నొక్కుకుంది. భరించలేని తల నొప్పికి తాళలేక, రెండు చేతుల మధ్యా తలదూర్చి టేబులుపై వాలిపోయింది గౌతమి.

ఉదయం జరిగిన సంఘటన ఆమె గుండెని చీల్చేస్తోంది రెండుగా. ఆమె పేరు నీలూ! ఆమె చూసిన జాలిచూపులు చాలు, గుండెని ముక్కలు ముక్కలు చెయ్యడానికి. ఆమె ఆక్రందన ఇంకా చెవులో రింగుమంటూ చెవి గూబల్ని పగలగొట్టేస్తుందేమోననిపిస్తోంది. ఆమె కళ్లనుంచి ప్రవహించే అశ్రుధార ఆమె ముఖాన్ని ముంచేసి గుండెల్ని తడిపేసి ఉప్పెనలా పొంగుతోంది. "నన్ను రక్షించండి. మా ఆయన నన్ను వెంటాడుతున్నాడు. నన్ను చంపేస్తాడు" అంది ఏడుస్తూ, తడబడుతూ, పిచ్చిదానిలా లోపలికి చొరబడుతూ, జాలిగా ప్రాధేయపడుతూ.

తెల్లని ఆమె మోముపై చెదిరి పడిన వెంట్రుకలూ, చెరిగి పోయిన కుంకుమ బొట్టూ, సగం ఊడి భుజంమీద పడ్డ సిగచుట్టూ, అంత ఏడుపులోనూ కొత్త అందాలు చిలికిస్తున్నాయి. ఆమెను చూస్తూ వుండిపోయింది మాటరాక గౌతమి. ఆమెనుండి సమాధానం రాక పోయేసరికి, వంటింట్లోంచి, పక్కనే వున్న రావు గారి ఫ్లాట్‌లో కెళ్లిపోయింది. బహుశాః అతనూ తనలాగే

మాట్లాడలేదేమో, పరుగు పరుగున మరో ఫ్లాట్‌లో కెళ్ళింది. అంతలోనే పరుగులు తీస్తూ వొస్తూన్న ఆరడుగుల అజాను బాహుడైన వ్యక్తి ఆమెని సమీపించాడు. వేటగాడిని చూసి బెదిరిన లేడిపిల్లలా వొణికిపోతూ, ఆ రెండతస్థుల మేడ మీద నుంచి దూకేసింది నీలూ. అంతా నిముషాల్లో జరిగిపోవడంతో, ఆ ఫ్లాట్లలో వున్న వాళ్ళంతా స్థాణువుల్లా నిల్చుండి పోయారు. అతను ఏం చెయ్యాలో తెలీక, అంతవరకూ కోపంతో అగ్నిశిఖలా వున్నవాడు, నిర్జీవంగా, పేలవంగా అయిపోయాడు. "ఏం నాయనా, ఆ మతిస్థిమితం లేని దానితో ఎందుకు మాట్లాడావూ?" అంటూ అతని దగ్గరగా వొచ్చి చెయ్యి పట్టుకుంది ఆమె. అతని తల్లి సూర్యముఖిట.

వెంటనే అతడు ఆమె మాటల్లోని క్లూ అందుకుని "ఆ(.....నాదే తప్పు. దానికి మతిస్థిమితం లేదు....దానికి మతిస్థిమితం లేదు...." అంటూ అప్పుడే మాట్లాడ్డం నేర్చుకున్నవాడిలా పొడిపొడిగా అంటూ కిందకి చూశాడు. అప్పటికే వందలమంది జనం కింద ఆమె చుట్టూ గుమిగూడి పోయారు. రక్తపు మడుగులో పడున్న ఆమె అప్పుడే పూచిన ఎఱ్ఱమందారంలా వుంది. జనంలో కలవరం! కంగారు! అందరూ భయాందోళనతో వున్నారు. "మతిస్థిమితం లేదు కదే! హయ్యో! ఎంతపని చేశావే!" అంటూ సూర్యముఖిగారు గుండెలు బాదుకుంటూ, అశక్తురాలిలా అక్కడే కూర్చుండి పోయింది. అతడు తల్లినీ, కింద పడ్డ భార్యనీ మార్చి మార్చి చూస్తూ 'మతిస్థిమితం లేదు...మతిస్థిమితం లేదు' అంటున్నాడు.

అంతలో ఎక్కడినుంచి వొచ్చారో ఎవరో పిలిస్తే పోలీసులు,నీలూనిచూసి పెదవి విరుస్తూ చుట్టూవున్న జనాన్ని తరమడానికి ప్రయత్నం చేస్తూవున్నారు. పోలీసుల ధాటికి ఆగలేక, విధి లేదన్నట్టు పనిమనిషి వీరమణి పరుగెత్తుకొచ్చింది ముక్కు చీదుతూ కళ్ళు తుడుచుకుంటూ "అమ్మగారూ.... ఆమె చచ్చిపోయింది!... కాదు.... వాళ్ళే చంపేశారు!...." అంటూ ఆ తల్లికొడుకులని చూపించింది.

"ఏమిటి? ఏమిటి నువ్వనేది? ఆమెకు మతిస్థిమితం లేదట! వాళ్ళు నెత్తీ నోరూ బాదుకుంటున్నారు" అంది గౌతమి.

"అంతా వొట్టిదమ్మగారూ! ఆమె చాల మంచిదట. మీకు మల్లేనే బాగా చదువుకుందట. పట్నంలో కాలేజీలో పని చేసేదట పెళ్ళి కాకముందు. పెళ్ళయ్యాక అనుమానపు మొగుడు ఆమెని కొలువు సెయ్యొద్దన్నాడట. బయటకే రానీడు. సొంత అన్నగారితో మాట్లాడినా అనుమానమేనట. ఆమె అత్తకేమో ఈమె ఇంకా కట్నాలూ కానుకలూ తేలేదని కోపమట. అస్తమానం శాపనార్థాలు పెట్టి తిట్టి చంపుతుందట ఈమెని. మొగుడేమో బెల్టుతో సావబాదుతాడట! ఇయ్యాల కాలేజీలో పనిచేస్తున్నప్పుడు ఆ కాలేజీలోనే పనిచేసిన ఒకాయన ఈల్లింటికొచ్చాడట. ఆమె కాఫీ కలిపి ఇచ్చిందట. రెచ్చిపోయి, ఆ వొచ్చినాయన. ఎల్లగానే బెల్టుతో సావబాదాట్ట. అల్ల పనిమనిసి సెబుతోంది అంతా. పోలీసులు రాసుకుంటున్నారు ఆమె సెప్పేదంతా. బంగారం అసుంటి తల్లట!" కళ్ళ నీళ్ళు పెట్టుకుంది వీరమణి.

వీరమణి కిందనుంచి రావడం చూసి అది చెప్పే వార్తలు వినడానికి గుమిగూడారు ఫ్లాట్‌లో వాళ్ళంతా!

"అవునండీ! మీ పనిమనిషి చెప్పేమాటలు కరెక్టే" అంది మూడో అంతస్థులో వున్న ఒకావిడ.

"మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగింది గౌతమి.

"ఇప్పుడు గుర్తొచ్చింది. వీళ్ళు బొల్లారంలో మా ఆడపడుచుగారింటి దగ్గరే వుండేవారు. ఎప్పుడూ బెల్టుతోనే కొట్టేవాడు పాపం! బాబోయ్ తోలు బెల్టు! అంటూ అతణ్ణి చూడగానే పరుగెత్తి పోయేవారు మా ఆడబడుచు పిల్లలు" అంది ఏదో జ్ఞాపకం వొచ్చినదానిలాగా.

"అయితే ఈ మాట కూడా పోలీసులకి చెప్పకూడదూ?" అన్నారెవరో ఆమెతో.

"బాబోయ్! నాకెందుకీ రామాయణం? రేపట్నుంచి పోలీసులు మనింటికొస్తారు, ఆపైన సాక్ష్యం,గీక్ష్యం అంటూ మమ్మల్ని బోనులో కీడుస్తారు."అంటూ మరి మాట్లాడనీయకుండా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది ఆమె!

పోలీసు వానులో నీలూని పడుకోబెట్టారు. ఆమె భర్తనీ, అత్తగారినీ కూడా వానులో కెక్కించారు. "ఏయ్! నువ్వు రావాలి. ఇక్కడ చెప్పినదంతా

అక్కడ పోలీసు స్టేషనులో చెప్పాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ సింగ్ ఆ పని మనిషి వంకచూస్తూ.

"ఓ.... నాకేంటి బయం. సెట్టంత మనిసిని కొట్టి సంపేసి పొట్టన పెట్టుకున్న ఆడిగురించి ఉన్నదున్నట్టు సెప్పడానికి నాకేటి బయం?" అంటూ వాళ్ళవెంట జీపులో బయలుదేరింది. పెద్ద పెద్ద ఉద్యోగస్థులూ, నాగరీకులూ అయిన ఫ్లాట్‌లో వాళ్ళంతా తలలు పంచుకుని లోపలికెళ్ళిపోయారు! వాన్ వెళ్ళిపోయింది!

గౌతమి సిగ్గుతో కుంచించుకుపోయింది. ఛీ! ఎందుకీ చదువు? ఎందుకీ ఉద్యోగం? ఈ హోదా? రక్షించండీ, అంటూ ఇంటో కొచ్చి ప్రాధేయపడిన తోటి ఆడదాన్ని ఆదుకోలేని బతుకు! పెదవి విప్పి నిజం చెప్పలేని సంస్కారం. తనకంటే ఆ పని మనిషే నయం! గౌతమి కళ్ళు నీటి కడవలయ్యాయి. తన మీద తనకే కోపం, అసహ్యం కలిగాయి. ఆ స్థితి వర్ణించలేనిది! మాటల కందనిది! మనసును కలిచేసేది! గుండెను పిండేసేది!

ఎలాగో తేరుకుని కాలేజీ కొచ్చినా, పాఠాలు చెప్పబుద్ధి కాలేదు. తనే హంతకురాలిలా, దోషిలా అన్పిస్తోంది ఆలోచించిన కొద్దీ! రక్షించమని ఆమె ప్రాధేయపడ్డ దృశ్యం, తను మాట్లాడకుండా మౌనంగా ఊరుకున్న తీరూ ఆమెని దహించి వేస్తోంది.

*　　*　　*

"ఏయ్! ఏమిటే ఒంట్లో బాగులేదా?" వీపుతట్టి అడుగుతూన్న ఫిజిక్స్ లెక్చరర్ మాతంగికేసి చూస్తూ వర్షిస్తూన్న కళ్ళని కర్చీఫుతో తుడుచుకుంటూ జరిగినదంతా చెప్పింది గౌతమి. ఆమె గుండెలోని బరువు కొంచెం తగ్గి నట్టయింది.

"పద. ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను" అంది మాతంగి. మంత్రముగ్ధలా వెనకాలే నడిచింది గౌతమి, గుండెలో పొంగుతూన్న దుఃఖాన్ని గొంతుతో అదిమిపెట్టే ప్రయత్నం చేస్తూ!

*　　*　　*

ఆ తరవాత కొద్ది రోజులకే సూర్యముఖిగారూ,ఆమె పుత్రరత్నం తోలు బెల్టు శ్రీకర్‌గారూ ఆ ఫ్లాట్ ఖాళీచేసి వెళ్ళిపోయారు. అందుకే వాళ్ళ సంగతులేమీ తెలీలేదు గౌతమికి. దాదాపు ఒక సంవత్సరం తరవాత పేపర్లోని వార్త చదివి ఆశ్చర్యపోయింది గౌతమి.

నీలూకి మతి స్థిమితంలేదని అత్తగారూ భర్తా సమర్పించిన సర్టిఫికెట్లూ, ప్రిస్క్రిప్షన్లూ అన్నీ దొంగ సర్టిఫికెట్లనీ, ఒక పని మనిషి చెప్పిన సాక్ష్యాధారాల ద్వారా అవన్నీ డబ్బిచ్చి కొనుక్కున్నవనీ ఋజువవడంవల్ల శ్రీకర్‌కి, అమె తల్లికీ కోర్టువారు తగిన శిక్ష విధించారనీ, అలా దొంగ సర్టిఫికెట్లూ, ప్రిస్క్రిప్షన్సూ ఇచ్చిన వారిని కూడా శిక్ష విధించారనీ చదివి, ఆ పని మనిషి చేసినంత సాయం కూడా తను చెయ్యలేకపోయినందుకు సిగ్గుపడింది. తానే కాదు, తనలా చదువుకుని ఉద్యోగాలు చేస్తూన్న ఆ ఫ్లాట్‌లోవున్న వాళ్ళెవరూ కూడా ఆమెని రక్షించలేకపోయారు!

"ఏ ఒక్కరు ఆమెని ఒక్క క్షణం ఆదరించి 'ఏం జరిగింది?' అని అడిగివుంటే, ఆ రోజున ఆ అనర్థాన్ని ఆపి వుండే వాళ్ళం కదా?" పేపరు చేతిలో పట్టుకుని ఆలోచిస్తూన్న గౌతమికి, ఆ పని మనిషి లక్ష్మి మాటలు చెవిలో రింగుమన్నాయి-

"అయమ్మ రచ్చించండోయ్ అంటూ ఈ ఇల్లోళ్ళందరినీ అడిగింది కానీ, తిన్నగా నా గుడిసె కాడికి పరుగెత్తుకొత్తే, నేను ఆమెను లోపలికి పిలిచి ఆడికి తగిన బుద్ధిసెప్పందేదాన్ని. ఆ ఇల్లాలిని తోలుబెల్టుతో కొట్టి సంపడం కాదు, మా ఇంటాయన సైకిల్ చైనుతో ఆడికి బుద్ధిసెప్పందేదాన్ని! హాఁ. ఈ పెద్దింటోల్లురచ్చిత్తారనుకుంది ఆ పిచ్చి తల్లి!" అంటూ.

"నిజమే! చదువూ సంధ్యా లేకపోయినా గుండె నిండా దానిలోవున్న మానవత్వం-చదువూ, హోదా, అంతస్థులలో మాలో ఇంకిపోయి గుండె అంతా ఈ కృత్రిమంతో నిండిపోయింది.''

గౌతమి కళ్ళల్లో ఉబుకుతున్న నీరు పేపర్లోని అక్షరాలు కనబడకుండా అడ్డురాగా, పేపరు మడిచి పక్కన పడేసింది అన్య మనస్కురాలై! ఆమె చెవిలో లక్ష్మి మాటలు రింగుమంటున్నాయి. 'పెద్దింటోల్లు.... పెద్దింటోల్లు!'*